క్లుప్తంగా

బోర్డులో పేర్లు మార్పు



బోర్డులో మారిన పేర్లు

సాక్షి ఎఫెక్ట్..

పాలసముద్రం: మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులో బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లను మార్చారు. ప్రస్తుతం పని చేస్తున్న వారి పేర్లు లేవని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమవడంతో ఎంపీడీఓ కార్యాలయ అధికారులు స్పందించారు. ప్రస్తుతం పని చేసేవారి పేర్లను కొత్తగా బోర్డులో ఏర్పాటు చేశారు.

19న నగరిలో జాబ్‌మేళా

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా ఈ నెల 19వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనేందుకు కనీస విద్యార్హత ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఫెయిల్/పాస్, బీటెక్, 18 ఏళ్ల నుండి 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు, కళాశాల పూర్వ విద్యార్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 63009 54441, 99635 61755 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సమష్టిగా సహకరించాలి

కార్వేటినగరం: పంచాయతీల అభివృద్ధికి ఆధికారులు, ప్రజా ప్రతినిధుల సమష్టి సహకారం ఎంతో అవసరమని ఎంపీపీ లత అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లత మాట్లాడుతూ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ చంద్రమౌళి మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రతి నెలా అభివృద్ధి పనులపై చర్చించుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు పంచాయతీ పరిధిలోని దిగువూరులో సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పనులు వేగంగా సాగుతున్నాయి. చాలా సంవత్సరాలుగా మురుగునీటి కాలువల సమస్యతో ఇబ్బంది పడుతున్న రాముల వారి గుడి వీధిలో స్థానిక నాయకుడు గుణశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ చొరవతో సమస్య పరిష్కారమైందని స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని సుబ్రహ్మణ్యం యాదవ్ అన్నారు.

జిల్లా పోటీలకు డైట్ విద్యార్థి



విద్యార్థి బ్లెస్సింగ్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: జిల్లా వాలీబాల్ పోటీలకు డైట్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి బ్లెస్సింగ్ ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులతో పాటు, ఎంఈఓ విజయకుమార్ జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థి బ్లెస్సింగ్‌ను అభినందించారు. అనంతరం విద్యార్థి బ్లెస్సింగ్‌కు ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు నాగరాజు, మునిలక్ష్మి పాల్గొన్నారు.

క్వారీ లైసెన్స్ రద్దు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న కీళపట్టు గ్రామస్తులు

నగరి: కీళపట్టు గ్రామ పరిధిలోని క్వారీ, మైన్స్‌కు ఇచ్చిన లైసెన్స్‌లను రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీ లైసెన్స్ నిమిత్తం నిర్వహించినట్లు చెబుతున్న ప్రజాభిప్రాయ సేకరణ అందరి ఆమోదంతో జరగలేదని స్పష్టం చేశారు. క్వారీలో పేల్చుతున్న బాంబులు, వాయు కాలుష్యం ప్రజలకు, పశువులకు ప్రాణాంతకంగా మారాయని తెలిపారు. క్వారీ సమీప దారిలోనే 8 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉందని తెలిపారు. ప్రయాణ సమయంలోనూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున క్వారీని రద్దు చేయాలని కోరారు.

విజయపురంలో మోస్తరు వర్షం

విజయపురం: మండలంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం పడింది. ఉదయం ఎండ ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్క సారిగా వర్షం పడడంతో వాతావరణం కొంత వరకు చల్లబడింది.

రైతన్నా జాగ్రత్త... విషపురుగుల కాలం

జాగ్రత్తలు పాటిస్తే ప్రాణాలకు రక్షణ



వర్షాకాలం... విషపురుగులు, పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. వానలు ప్రారంభం కాగానే ఖాళీ స్థలాలు, నీటి మరుగు, గడ్డిమొక్కలు ఉన్న ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటాయి. కుంటలు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, గడ్డి వాములు, పేర్చిన కట్టెలు, ఇతర ఖాళీ ప్రదేశాల్లో విష పురుగులు సంచరిస్తుంటాయి. నియోజకవర్గంలోని పాలసముద్రం, కార్వేటినగరం, జీడీనెల్లూరు, వెదురుకుప్పం తదితర మండలాల్లో అధికంగా అటవీ సరిహద్దు గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంతమంతా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పరాత్రీపగలనక పంట పొలాల్లో తిరిగే రైతులు తరచుగా పాము కాటుకు గురవుతుంటారు. ముఖ్యంగా రైతులు, కూలీలు అటవీ ప్రాంతాల్లో తిరుగుతుంటారు. పొలాల వద్ద నివాసం ఉంటున్నవారు, ఖాళీ ప్రదేశాలకు సమీపంలో ఉంటున్న వారు విషసర్పాలతో జాగ్రత్త పడాల్సి ఉందని వైద్యాధికారులు, వ్యవసాయాధికారులు చెబుతున్నారు. – పాలసముద్రం

పాము కాటేసే సమయాలు

వర్షాకాలంలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో విషపురుగులు. పాములు అధికంగా సంచరిస్తుంటాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అవి కాటు వేస్తాయి. వర్షాకాలంలో రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై, పాము కాటుకు గరయ్యే ప్రమాదాలు అనేకం ఉంటాయి. పాములు కూడా గుడ్లను పొదిగి పిల్లలకు లేసే సమయం. కప్పలు, ఎలుకలు కూడా బయటకు వచ్చే సమయం వర్షాకాలమే కావడంతో వాటిని వేటాడేందుకు పాములు సంచరిస్తుంటాయి. పొలం గట్లు, అటవీ ప్రాంతాల్లో, పొదల్లో ఎక్కువగా పాములు, విష పురుగులు తిరుగుతుంటాయి.

పాములు సంచరించే ప్రాంతాలు

కాల్వగట్లు, పొదలు, గడ్డి వాములు, పొలం గట్లు, పశువుల పాకలు, పాడుబడిన ఇళ్లు, పెంటదిబ్బల్లో ఎక్కువగా విష పురుగులు సంచరిస్తుంటాయి. రాత్రి వేళల్లో ఆహారం కోసం బయటకు వచ్చి బల్లులు, ఎలుకలు, కప్పలు, తొండలను పట్టుకుని ఆరగిస్తాయి. ఇలాంటి ప్రాణులు ఎక్కువగా ఉన్న చోట పాములు కూడా ఎక్కువ శాతం తిష్టవేసి ఉంటాయి. వేడి రక్తం ప్రవహించే జంతువులు, మనుషులు, సమీపంలోకి వచ్చినప్పుడు వెంటనే వాటిని గుర్తించి కాటు వేస్తాయి. పంట పొలాల్లో తిరిగే పాములు చాలా ప్రమాదకరమైనవి, విషపూరితమైనవి. పాములు ఏకాంతానికి భంగం కలిగినప్పుడు, ప్రాణ భయం ఉన్నప్పుడు, ఎవరైనా వాటిపై కాలు మోపినప్పుడు అవి వెంటనే కాటు వేసే ప్రమాదం ఉంది.

పాము కాటు గుర్తింపు

పాము కాటు శరీరంపైన పడిందా లేక బట్టల పైన పడిందా అన్న విషయాన్ని ముందుగా పరిశీలించాలి. శరీరం పైన కాటు వేస్తే ఎన్ని గాట్లు పడ్డాయో చూడాలి. తాచుపాము, కట్లపాము, రక్తపింజరి కాటేస్తే రెండు గాట్లు పడతాయి. అంతకంటే ఎక్కువ గాట్లు కన్పిస్తే అది సాధారణ పాముగా గుర్తించవచ్చు. కాటు వేసిన శరీర భాగం నుంచి ఇతర భాగాలకు రక్తప్రసరణ జరగకుండా పైభాగాన రబ్బరు లేదా తాడు లేదా గుడ్డతో గట్టిగా కట్టాలి. దీనివల్ల విషం త్వరగా గుండెను చేరకుండా నివారించవచ్చు.

ప్రథమ చికిత్స

పాము కాటు వేసిన పైభాగంలో వెంటనే రక్త ప్రసరణ లేకుండా బిగించి తాడుతో కట్టి వేయాలి. కాటు వేసిన శరీర భాగాన్ని బ్లేడుతో గాయం చేసి, రక్తం కారకుండా జాగ్రత్త పడాలి. పాము కాటుకు గురైన వ్యక్తి ముందుగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పక్కన మరో వ్యక్తి ఉంటే బాధితుడికి ధైర్యం చెప్తూ ఉండాలి. పాము కాటుకు గురైన వ్యక్తిని నిద్ర పోకుండా ఆస్పత్రికి తరలించాలి.



జాగ్రత్తలు

గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో తిరిగే వారు, అక్కడే నిద్రించే వారు వెంట లైటు(లాంతరు) ఉంచుకోవాలి. పాములు కిరోసిన్, పెట్రోలు వాసన భరించలేవు. పాము ఉన్నదని అనుమానం వస్తే వీటిని ఉపయోగిస్తే మంచిది. రైతులు, కూలీలు రాత్రి వేళల్లో తిరిగేటప్పుడు మోకాళ్ల వరకు రబ్బరు బూట్లు వేసుకోవడం మంచిది. గడ్డి పని చేసే వారు చేతికి రబ్బరు తొడుగులు తొడుక్కోవడం మంచిది. నివాసాల చుట్టూ ముళ్ల పొదలు లేకుండా చూసుకోవాలి.



విషపూరిత పాములు

కట్ల పాములు, రక్తపింజరి, తాచుపాములు, నాగుపాము, తేళ్లు, జెర్రెలు ప్రమాదకరం. వాటి కాటుకు గురైన బాధితులకు సరైన సమయంలో వైద్యం అందకపోతే ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. తాచుపాము, నాగుపాము, కట్లపాము కాటేస్తే వాటి విషం నేరుగా నాడీ మండలం, ఊపిరితిత్తులపై పని చేస్తుంది. హృదయ స్పందన ఆగి అప్పటికప్పుడే మరణం సంభవిస్తుంది. రక్తపింజరి విషం ఎక్కువగా రక్తనాళాలపై ప్రభావం చూపుతుంది. రక్తనాళాలు చిట్లి నోటి నుండి రక్తం వస్తుంది. రక్తనాళాల్లో రక్త ప్రసరణ ఆగిపోతుంది. రక్తం గడ్డకట్టడంతో కాటుకు గురైన వ్యక్తి మరణిస్తాడు.

బహిరంగ సభకు స్థల పరిశీలన

– వైఎస్‌ఆర్ సీపీ ఆత్మీయ సమావేశ సభను విజయవంతం చేయండి




సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 49కొత్తపల్లి మిట్టలో ఈ నెల 19వ తేదీ వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా 49 కొత్తపల్లిమిట్టలో సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నారాయణస్వామి కోరారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ గురవారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు బాబురెడ్డి, తిప్పినాయుడుపల్లి సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మణి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కాలప్ప, డిసెంబర్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తిప్రపత్తులతో వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని అలంకరించారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. పూజా కార్యక్రమానికి సామాజిక కార్యకర్త మిట్టపల్లె వాసుదేవరెడ్డి, జానకి దంపతులు, కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. పూజల్లో ఆలయ ధర్మకర్త రాధాకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, సభాపతిరెడ్డి, ఢిల్లీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



నాటు సారాను స్వాధీనం చేసుకుంటున్న, చేస్తున్న పోలీసులు

వెదురుకుప్పం: మండలంలోని కురివికుప్పం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని వెదురుకుప్పం పోలీసులు అరెస్ట్ చేసి, నగదును స్వాధీనం చేసుకున్నారు. వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కురివికుప్పం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు రహస్య సమాచారం మేరకు శుక్రవారం ఎస్‌ఐతోపాటు పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురిని పట్టుకున్నారు. వారిలో మధు, చిరంజీవి, మణి, రమేష్, మోహన్, మునికృష్ణ ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.4700 స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ చెప్పారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

మండలంలోని దేవరగుడిపల్లె ఎస్సీ కాలనీలో నాటు సారా అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. దేవరగుడిపల్లె గ్రామానికి చెందిన శంకరయ్య నాటు సారా అమ్ముతుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్ద ఉన్న ఆరు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం తయారీపై ఉక్కుపాదం





పొదలపల్లి దళితవాడలో పట్టుబడిన సారా, ద్విచక్ర వాహనాలతో పోలీసులు, యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ

- మద్యం కేసులో పట్టుబడితే పీడీ యాక్టు
- విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దు
- 2000 లీటర్ల ఊట ధ్వంసం, 100 లీటర్ల సారా స్వాధీనం

శ్రీరంగరాజపురం: అక్రమ మద్యం తయారీలు, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో సారా అమ్మకాలు, తయారీలను అణచివేతే లక్ష్యమని సీఐ హనుమంతప్ప అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పొదలపల్లి గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో సుమారు 2 వేల లీటర్ల బెల్లం ఊట, 100 లీటర్ల సారాతో సహా సరైన పత్రాలు లేని 28 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు అనుమానితులపై విచారించి కేసు నమోదు చేస్తానన్నారు. ఈ సందర్భంగా సీఐ హనుమంతప్ప మాట్లాడుతూ అక్రమ మద్యం తయారీ, అమ్మకాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సారా తయారీ చేసే వారిపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలిస్తామని, భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సారా తయారీలో అక్రమార్కులు వినియోగించే పదార్థాలతో మద్యానికి బానిసలైన వారు చిన్న తనంలోనే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉందన్నారు. పలు మార్లు కేసు నమోదు అయితే వారిపై పీడీయాక్టు కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు సుమన్(శ్రీరంగరాజపురం), రాజ్‌కుమార్(కార్వేటినగరం), వెంకటసుబ్బయ్య(వెదురుకుప్పం), 30 మందికి పైగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

వెదురుకుప్పం: గ్రామాల అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అవసరమని ఎంపీపీ నాగరాణి అన్నారు. శుక్రవారం వెదురుకుప్పంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, కార్యదర్శులతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలన్నారు. సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల అవసరం మేరకు ఎలాంటి పనులు, వసతులు కల్పించాలో గుర్తించి గ్రామాలను ప్రగతి పథంలోకి తీసుకురావాలని కోరారు. సర్పంచ్‌లు బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అమర్‌నాథ్, ఈఓపీఆర్డీ పురుషోత్తం, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు

నింద్ర: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. ప్రజలకు తమ ఇంటి వద్ద కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ఆదేశించారు. దీంతో మండల కేంద్రమైన నింద్రలో పలు వీధుల్లో పరిసరాలు పరిశుభ్రత పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాబురెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

పాలసముద్రం: మండల పరిధిలోని చెరువుల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని ఇరిగేషన్ ఎస్ఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికలపై మండల అధికారులకు డీఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఎస్ఈ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ చెరువుకి సంబంధించిన రైతులు మాత్రమే ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ విధానాన్ని తరువుగా వివరించారు. కార్యక్రమంలో ఏఈ చీరాలయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికలతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

గంగాధరనెల్లూరు: ముందస్తు ప్రణాళికలతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ అనిత అన్నారు. గంగాధరనెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీవో లీడర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 2018 ఆన్‌లైన్ విధానం వచ్చిన తరువాత అనేక మార్పులు వచ్చాయన్నారు. ప్రస్తుతం గ్రామాలకు సంబంధించి వచ్చే నిధులు, ఎంత ఖర్చు పెడుతున్నారు, ఎంత నిల్వ ఉంది ఇలా ప్రతి విషయాన్ని సామాన్యులు కూడా ఎప్పుడైనా చూసుకునే సౌకర్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేడుకగా కార్తీక దీపోత్సవం



పుత్తూరులో సదాశివేశ్వరుడు, నగరిలో చంద్రమౌళేశ్వరస్వామికి అన్నాభిషేకం, గంగాధరేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు, యాగశాల పూజలు

పుత్తూరు: పుత్తూరు పట్టణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు.

నగరి: తిరుపురసుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దీపారాధన చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

గంగాధరనెల్లూరు: మండలంలోని శైవక్షేత్రాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక పున్నమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గంగాధరేశ్వర ఆలయం, కొట్రకోనలోని శివాలయం, సిద్ధేశ్వర కొండలోని ఆలయంలో మహా శివునికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు శివాలయాలలో కార్తీకదీపం వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

వెదురుకుప్పం: మండలంలోని పలు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పాలు, పెరుగు, నారికేళ జలంతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తిప్రపత్తులతో పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

పాలసముద్రం: మండలంలోని రాచపాళెం గ్రామంలో పురాతన వట వృక్షం కింద వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి శుక్రవారం కార్తీక పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ పూజలకు ఉభయదారులుగా తహసీల్దార్ అరుణకుమారి వ్యవహరించారు. వేదపండితులు స్వామివారి ఎదుట కలశం ఉంచి వివిధ యాగశాల పూజలు నిర్వహించారు. అనంతరం కలశంతో నయ్యాడి వాయిద్యాలతో ఊరేగించి స్వామివారికి సమీపంలో ఉన్న అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక అలంకారంతో సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు దీపారాధన చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో మహిళలు పిండీ దీపాలు వెలిగించారు.

వేడుకగా శ్రీవేణుగోపాలుని ఊరేగింపు



ఊరేగింపునకు తరలిన శ్రీసంతాన వేణుగోపాల స్వామి

కార్వేటినగరం: టీటీడీ అనుబంధ ఆలయాల్లో ఒక్కటైన శ్రీసంతాన వేణుగోపాల స్వామివారు కార్తీక పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి గ్రామ వీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, మూల విరాట్‌ను పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్టించి మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా టీటీడీ వేద పండితులు వేద మంత్రాలతో కార్తీక దీపాలు వెలిగించి ఆలయ నుంచి ఊరేగింపుగా స్కంధ పుష్కరిణి వరకు తీసుకెళ్లారు. పుష్కరిణిలో వదలి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధ్యక్షుడు సురేష్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

నగరి: పట్టణంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీకరియ మాణిక్యస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఏటా కార్తీక మాసంలో పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవ కన్నుల పండువగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీరు తదితర సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం పవిత్రమాలలను ఆలయ ప్రదక్షిణ చేసి, ఆలయ పరివార దేవతలకు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, ధ్వజ స్తంభ పీఠానికి పవిత్రమాలలను సమర్పించారు. సాయంత్రం గ్రామోత్సవం, యాగశాల పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ఏఈఓ రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి వెంకటరమణ, గుణశేఖర్, ప్రధాన అర్చకులు నరసింహప్రసాద్, ధన్వంతరాచార్యులు, వేదపారాయణులు రాంప్రసాదాచార్యులు, అర్చకులు తరుణ్‌కుమార్, ప్రశాంత్, దాశరథి, సాయి, శ్రీనివాసాచార్యులు, గౌతమ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

నగరి: సమస్యలు పరిష్కరించాలంటూ 108 కాంట్రాక్ట్ ఉద్యోగులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం, అధికారులు తమ సమస్యల గోడు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీసులను స్వయంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారులిచ్చిన హామీ మేరకు స్లాబ్ పద్ధతిలో అందరికీ వేతనాలు చెల్లించాలని కోరారు. సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్య, ఆరోగ్య శాఖలోని ఈఎంటీ పోస్టుల్లో 108 సిబ్బందిని నియమించాలని కోరారు. పైలట్లు, ఈఎంటీలకు ఇతర ఖాళీల్లో వారి అర్హతలను బట్టి వెయిటేజ్ ఇచ్చి నియామకాలు చేపట్టాలన్నారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సహజ మరణం, ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని కోరారు.


గ్రామాల అభివృద్ధే లక్ష్యం


విజయపురం: శాస్త్ర సాంకేతిక ఫలాలను అందిపుచ్చుకుంటూ పేదరికం, అసమానతలు లేని, ఆరోగ్యకమైన, ఆనందదాయకమైన గ్రామాలను నిర్మించుకోవడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని ఈఓపీఆర్‌డీ రాజేంద్రన్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణప్రకాష్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక నిధులతో గ్రామాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఇంటింటికి మరుగుదొడ్డి, రక్షిత తాగునీరు, నిరంతర విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రతి కుంటుంబానికి జీవనోపాధి కల్పించాలన్నారు. ఇంటిలో అందరూ చదువుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆదునిక వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇస్తూ, వారికి అవసరమైన రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

వడమాలపేటలో...

వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ శేష గిరిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గ్రామాభివృద్ధిపై సర్పంచ్, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవం





వడమాలపేట గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు, పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలంలో 57వ గ్రంథాలయ వారోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ద్రాక్షాయణి మాట్లాడుతూ ఎక్కువగా పుస్తకాలను చదవడంతో మేధస్సును పెంచుకోవచ్చునని ఆమె అన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకపఠనం చేయించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు, కథలు, కవితలు, నవలలు, దినపత్రికలు, రామాయణం, మహాభారతం తదితర విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. విద్యార్థులు, యువత క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి చదువుకుని, విజ్ఞానవంతులు కావాలని ఆమె కోరారు. వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, చివరి రోజు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వర రావు, మంజుల పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు

పుత్తూరు: పట్టణంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ మీనాకుమారి కోరారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం లైబ్రరీలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువత తరచూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని ఆర్జించవచ్చునన్నారు. తద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాపువీధిలోని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మల్లికారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.